నకిలీ పత్తి విత్తనాల దందాపై ఉక్కుపాదం 6లో..

తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదు.. 6లో..

అభివృద్ధి అంతంతే?



పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండ్

- జిల్లాలో పూర్తికాని రామగుండం ఎత్తిపోతల పథకం
- అడుగు ముందుకు పడని పత్తిపాక రిజర్వాయర్
- పోతారం ఎత్తిపోతలకు అతీగతీ లేదు
- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై నేటికి పదేళ్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు గడిచి దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నా జిల్లాలో అభివృద్ధి అంతంత మాత్రంగానే జరిగింది. ఇంకా జరగాల్సిన పనులు జరగకుండా పోయాయి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొన్ని సమస్యలే పరిష్కారం కాగా, మరికొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా పెండింగు పనులను పూర్తిచేసి, మరిన్ని అభివృద్ధి పనులనే చేస్తుందనే ఆశల్లో జిల్లా ప్రజలు ఉన్నారు. నబ్బండ వర్ణాలు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై ఆదివారం నాటికి పదేళ్లు గడుస్తున్నది. తెలంగాణ ఏర్పాటైన 2014లో జరిగిన ఎన్నికల్లో ఉద్యమ పార్టీ అయిన తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది. 2018లో జరిగిన ఎన్నికల్లోనూ ఆ పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. 2016 అక్టోబర్‌లో చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా పెద్దపల్లి జిల్లా ఏర్పాటయ్యింది. దీంతో కొన్ని అభివృద్ధి పనులు మాత్రమే జరిగి, ఆశించిన మేరకు అభివృద్ధి పనులు జరగకపోవడంతో జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో నూతన కలెక్టరేట్ భవన నిర్మాణంతో పాటు, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలుగా ఏర్పడ్డాయి. కొత్తగా అంతర్గాం, పాలకుర్తి, రామగిరి మండలాలు ఏర్పడ్డాయి. మానేరు నదిపై కొన్ని చెక్ డ్యామ్‌లను నిర్మించగా, అందులో రెండింటికి వరదలకు గండ్లు పడ్డాయి. రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటయ్యింది. జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పటికీ జిల్లాకు చుక్క నీరివ్వలేదు. ప్రతిపాదనలో ఉన్న పోతారం ఎత్తిపోతల పథకం మంజూరుకు నోచుకోలేదు. ఈ పథకానికి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మంథని ప్రాంతంలోని 30 వేల ఎకరాల భూములకు సాగునీరంచాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. అలాగే జిల్లాలోని శ్రీరాంసాగర్ ఆయకట్టు భూములను స్థిరీకరించేందుకు కాళేశ్వరం నీటిని పత్తిపాక రిజర్వాయర్ ద్వారా అందించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించినప్పటికీ, అందుకు అడుగులు పడలేదు. కానీ వరద కాలువ నుంచి కాకతీయ ప్రధాన కాలువ వరకు లింకు కాలువ నిర్మించినప్పటికీ, అది రైతులకు పూర్తి స్థాయిలో ఉపయోగపడడం లేదు. గాయత్రి పంప్‌హౌస్ ద్వారా నీటిని వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలించే సమయంలో లింకు కాలువ ద్వారా నీటిని సరఫరా చేసే వీలుంటుంది. పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం లభించనున్నది. రామగుండం నియోజకవర్గంలోని 20 వేల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు భూములను స్థిరీకరించేందుకు 78 కోట్లతో చేపట్టిన రామగుండం ఎత్తిపోతల పథకం ఇప్పటికీ పూర్తికాలేదు. ఈ పనులకు స్వయంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేయడం గమనార్హం. బిల్లులు రావడం లేదనే కారణంగా పనుల్లో జాప్యం జరుగుతున్నది. ఈ ఎత్తిపోతల పథకానికి సరిపడా నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తేనే రైతులకు సాగు నీటి కష్టాలు తీరనున్నాయి.

● నెరవేరని హామీలు

మైనింగ్ కళాశాలను మంజురుచేస్తామన్న హామీ నెరవేరకపోవడం, మానేరు నదిపై చేపట్టిన ఓడేడు వంతెన కొట్టుకు పోగా, నీరుకుళ్ల వంతెన ఉపయోగంలోకి తీసుకరాలేదు. గౌతమ బుద్ధుడికి చిహ్నంగా ధూళికట్ట బౌద్ధ స్తూపాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. జిల్లాలో ప్రధాన దేవాలయం అయిన శ్రీఓదెల మల్లికార్జున ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. కాల్వశ్రీరాంపూర్ శివారులోగల మానేరు నదిపై గుంటిమడుగు వద్ద చేపట్టాలనుకున్న చిన్నరిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరుకాకపోవడంతో కాలువ చివరి భూములకు నీరందడం లేదు. జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు కల ఇప్పటికీ నెరవేరలేదు. అలాగే రామగుండంలో మైనింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. ఇక్కడ ఆ కళాశాల ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతపౌకర్యంగా ఉంటుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లి మైనింగ్ కోర్సులు చదివేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రామగుండం ప్రాంతం పారిశ్రామికంగా విస్తరించి ఉండడంతో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తే మరికొంత మందికి ఉపాధి లభించనున్నారు. బీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని విస్తరించాలనే ప్రతిపాదన ఎప్పటినుంచో ఉండగా, దానిని త్వరిగతిన చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, మంథని మండలం గుంజపడుగును మండలాలుగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఇంకా నేరవేరలేదు. ఆరు మాసాల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో పెండింగులో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి, కొత్తగా మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టాలని మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్‌లను జిల్లా ప్రజలు కోరుతున్నారు.

● కలెక్టరేట్ లో ఏర్పాట్లు పూర్తి

పెద్దపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 2వ తేదీన జరగనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం కలెక్టరేట్ ముఖ ద్వారాన్ని, కలెక్టర్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో కలెక్టరేట్ చూపరులను ఆకట్టుకుంటున్నది. ఆదివారం ఉదయం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉదయం 8:57 గంటలకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పోలీసులచే గౌరవ వందనం స్వీకరించనున్నారు. 9 గంటలకు ఆయన జాతీయ పథకాన్ని ఎగుర వేయనున్నారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు జెండా ఎగుర వేయడానికి అవకాశం ఉండదు.



విద్యుత్ దీపాల అలంకరణలో కలెక్టరేట్

అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ కార్యక్రమాలు ఏమి జరగవని అధికారులు తెలిపారు.

పకడ్బందీగా ఆన్‌లైన్‌లో కౌంటింగ్ వివరాల నమోదు : కలెక్టర్

పెద్దపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పకడ్బందీగా ఆన్‌లైన్ ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో కౌంటింగ్ వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఆన్‌లైన్ ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో కౌంటింగ్ వివరాల నమోదు ప్రక్రియ గురించి సంబంధిత కౌంటింగ్ ఆపరేటర్లతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఫలితాలు సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఎన్నికల కమిషన్ ఎన్‌కోర్ వెబ్‌సైట్ వ్యవస్థ ప్రవేశపెట్టిందన్నారు. కౌంటింగ్ రోజు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 14 టేబుల్స్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లను నియమిస్తామని, సి1 ఆపరేటర్‌కు టేబుల్ సంఖ్య 1,2,3,4, సి2 ఆపరేటర్ టేబుల్ సంఖ్య 5,6,7, సి3 ఆపరేటర్‌కు టేబుల్ సంఖ్య 8,9,10,11, సి4 ఆపరేటర్‌కు టేబుల్ సంఖ్య 12,13,14 టేబుల్స్ కేటాయించారని, ప్రతి రౌండ్ కౌంటింగ్ సమయంలో సంబంధిత టేబుల్‌లో పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన ఫలితాలు ఆయా ఆపరేటర్లు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి టేబుల్ కౌంటింగ్ వివరాలు సదరు ఆపరేటర్లకు వచ్చేందుకు, ఆపరేటర్ల వారీగా కలర్ సిస్టం ఏర్పాటుచేశామని, సి2 ఆపరేటర్ పరిధిలో సిబ్బంది రెడ్ కలర్, సి 3 ఆపరేటర్ పరిధిలో సిబ్బంది గ్రీన్ కలర్, సి4 ఆపరేటర్ పరిధిలో సిబ్బంది బ్లూ కలర్, సి3 ఆపరేటర్ పరిధిలో సిబ్బంది యెల్లో కలర్ షర్ట్ ధరిస్తారని అన్నారు. ప్రతి టెబుల్ వివరాలు నమోదు చేసిన తర్వాత సదరు రౌండ్ ఫలితాలను ఫ్రీజ్ చేస్తామని తెలిపారు. ఏ రౌండ్‌లో ఏదైనా పొరపాటు జరిగినట్లు గుర్తుపై సదరు రౌండ్ ఫలితాల ఫ్రీజ్ తొలగించి, కౌంటింగ్ వివరాలను సరి చేయాలని, తదుపరి రౌండ్ ఫలితాలు ఆటోమెటిక్‌గా క్యారీఫార్వర్డ్ అవు తాయని అన్నారు. ఈవీఎం ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను నమోదు అనంతరం రిటర్నింగ్ అధికారి కౌంటింగ్ పరిశీలకులతో కలిసి పరిశీలించి తుది ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో సంబంధి త అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుందిళ్ళ బ్యారేజీని పరిశీలించిన నిపుణుల బృందం

మంథనిరూరల్, జూన్ 1: మండలంలోని సిరిపురం వద్ద గోదావరినదిపై నిర్మించిన సుందిళ్ళ బ్యారేజీని ఈఎన్‌సీ జనరల్ అనీల్ కుమార్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం శనివారం సాయంత్రం సందర్శించింది. అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజ్ డౌన్ సీమ్ ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల వివరాలను తెలుసుకొని ఇంజనీరింగ్ అధికారులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. బృందంలో రిటైర్డు ఈఎన్‌సీ మెకానికల్ అడ్వయిజర్ సత్యనారాయణ, ప్రొఫెసర్లు రాజశేఖర్, రమణ మూర్తితో పాటు ఎస్ఈ సుధాకరెడ్డి, సీఈ కరుణాకర్‌లు, స్థానిక ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

'అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్న గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణాలు'

కోల్‌సిటీ, జూన్ 1: రామగుండం కార్పొరేషన్‌లో ఇండియన్ గ్యాస్ పైప్ లైన్ నిర్మాణాలతో రోడ్లన్నీ పగలగొడుతూ అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నారని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలతరాజు ఒక ప్రకటనలో ఆరోపించారు. వెంటనే వారికి ఇచ్చిన పర్మిషన్ రద్దుచేసి ప్రజలకు ఇబ్బంది కాకుండా కార్పొరేషన్ అధికారులు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు.

సింగరేణి సీఎండీ బలరాంకు ఐఐఐఈ పర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు

- సంస్థకూ అత్యుత్తమ పనితీరు అవార్డు



సీఎండీ తరపున అవార్డు అందుకుంటున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని, జూన్ 1: సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాంనాయక్‌కు జాతీయస్థాయి ట్రిపుల్ ఐఈ (ఇండి యన్ ఇన్‌స్టిట్యూషట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్) సంస్థ ప్రతిష్టాత్మక పర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు-2024ను ప్రకటించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో శుక్రవారం రాత్రి జరిగిన 24వ జాతీయ స్థాయి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాంనాయక్ తరపున డైరెక్టర్ (ఆపరేషన్స్, పర్సనల్) ఎన్‌వీకే శ్రీనివాస్ ఈ అవార్డును స్వీకరించారు. ఎన్ బలరామ్ నాయక్ సింగరేణి సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఉతత్తి, ఉత్పాదకతల పెంపునకు నిత్యం సమీక్షలు నిర్వహించారు. గనుల వారీగా లక్ష్యాల సాధనకు దిశా నిర్దేశం చేశారు. ఆయన చూపిన చొరవతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ తన చరిత్రలోనే అత్యధికంగా 700లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, బొగ్గు రవాణాను సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. అంతేకాదు రూ.35,700కోట్ల టర్నోవర్ సాధించడం జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఉత్పత్తి కన్నా అధికంగా సాధిస్తూ సరికొత్త రికార్డులు సృష్టించడంతో జాతీయ స్థాయిలో సింగరేణి మంచి పేరు వచ్చింది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ వారు ఆయనకు వ్యక్తిగతంగా పర్ఫార్మెన్స్ ఎక్స్ లెన్స్ అవార్డు-2024 బహూకరించారు. అలాగే కంపెనీల విభాగంలో అద్భుతమైన పనితీరును కనపరిచిన కంపెనీగా సింగరేణికి పెర్ఫార్మెన్స్ ఎక్సలెంట్ అవార్డును నిర్వాహకులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ నుంచి జీఎం(ఎంఎస్) టీ సురేష్ బాబు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఎన్ భాస్కర, డీజీఎం(ఐఈ) సీహెచ్ సీతారాంబాబు, ట్రిపుల్ ఐఈ గౌరవ కార్యదర్శి ఏవీవీ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు. సింగరేణి సంస్థలోని ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషి వల్లనే లక్ష్యాలు సాధించగలిగామని, సింగరేణికి లభించిన అవార్డులు సింగరేణి సంస్థ ఉద్యోగులకు చెందుతాయని, ఈ స్ఫూర్తితో మరింతగా పనిచేస్తూ ఉన్నత లక్ష్యాలు సాధించాలని సీఎండీ ఎన్ బలరామ్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

అమరవీరులకు కొవ్వొత్తులతో ఘన నివాళి

గోదావరిఖని, జూన్ 1: తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని శనివారం రాత్రి గోదావరిఖనిలో నిర్వహించారు. స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయం నుంచి చౌరస్తాలోని అమరవీరుల స్మారక స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు, ఎంతోమంది త్యాగాల ఫలితం వలన తెలంగాణ ఏర్పాటు జరిగినదని పేర్కొన్నారు. నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, నాగెల్లి సాంబయ్య, వడ్డేపల్లి శంకర్, ఎల్ వెంకటేష్, చేల్పూరి సతీష్, చల్ల రవీందర్ రెడ్డి, సత్యనారాయణ, వాసర్ల జోసెఫ్, పోలాడి శ్రీనివాస్‌రావు, చిలకలపల్లి శ్రీనివాస్, రాజేశం, కొండ్ర అంజయ్య, పులిపాక శంకర్, ఉప్పులేటి తిరుపతి, గుండ శ్రావణ్, దిడ్డి లక్ష్మణ్, మహేందర్ రెడ్డి, తాటికంటి తిరుపతి, వెంకటరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

బద్దెనపల్లిలో రోడ్డు ప్రమాదం

- నలుగురికి తీవ్రగాయాలు

తంగళ్లపల్లి, జూన్ 1: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ శివారులో ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కల్వాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల గణేష్ (35) కుటుంబ సభ్యులతో కలిసి మాల విరమణ కోసం కొండగట్టుకు వెళ్లారు. తిరిగి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం కాగా బద్దెనపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న అటో ఢీకొట్టింది. దీంతో పూజ (22), జశ్వంత్ (16), అటో డ్రైవర్ రాకేష్ 19, మధు (20) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో అసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహా ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ ప్రాత ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎన్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

శ్రీ ఆంజనేయం



ఆలయ ఆవరణలో భక్తులు

- కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి
- స్వామివారిని దర్శించుకున్న లక్షన్నరకు పైగా భక్తులు
- ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి

కిక్కిరిసిన దీక్ష విరమణ మండపం

వేలాదిగా తరలివచ్చిన అంజన్న దీక్షాపరులతో కల్యాణ కట్టలో ఏర్పాటు చేసిన దీక్ష విరమణ మంటపం కిక్కిరిసింది. మాల విరమణ ఏర్పాట్లను ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు. మాల విరమణ చేసిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. జయంతి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

మల్యాల, జూన్ 1: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజన కోటితో కొండగట్టు కిక్కిరిసింది. శుక్రవారం అర్ధ రాత్రి నుంచి శనివారం వరకు రామ లక్ష్మణ జానకీ జై.. బోలో హనుమాన్ కీ.., రామ భక్త హనుమాన్‌కీ జై.. అనే అజన్న దీక్షాపరుల సంకీర్తనలు కొండగట్టు క్షేత్రం మార్మోగిపోయింది. దీంతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. కొండపైన ఎటు చూసినా రామనామ సంకీర్తనలతో కొండంతా మార్మోగింది. లక్షలాదిగా తరలివచ్చిన అంజన్న దీక్షాపరులు, భక్తులు నృత్యాలతో శ్రీరామ భక్తుడు హనుమంతుడిని తమ సంకీర్తనలతో కొలిచారు. రామదండును తలపించేలా శుక్రవారం రాత్రి నుంచి వచ్చిన దాదాపు లక్షకు పైగా వచ్చిన అంజన్న దీక్షాపరులతో కొండంతా కిక్కిరిసిపోగా కొండగట్టు క్షేత్రం కాషాయ వర్ణాన్ని పులుముకుంది. రామనామ స్మరణలతో హోరెత్తింది. 41, 21, 11 రోజుల దీక్ష బూనిన అంజన్న దీక్షాపరులు కొండపైకి చేరుకుని, మాల విరమణ కోసం ఏర్పాటు చేసిన కల్యాణ కట్టలో దీక్షలు విర మించారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారి జేఎన్‌టీయూ మార్గం గుండా రామదండును తలపించేలా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజన సాగరంగా మారింది.



దీక్షాపరుల పాదయాత్ర

- **ఘనంగా హనుమాన్ జయంతి**

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా వైశాఖ బహుళ దశమి సందర్భంగా నిర్వహించే పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా అంజన్న సన్నిధిలో ఉదయం మూడు గంటలకు తిరుమంజనం, ద్రావి డ ప్రబంధ పారాయణములు, విశేష అభిషేకం, తులసీ అర్చన, శ్రీ స్వామి వారికి పట్టు వస్త్రాలంకరణ, సహస్ర నాగవల్లి, అర్చన, హోమం, మహా పూర్ణాహుతితో పాటు ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో త్రైయాహ్నిక, త్రికుండాత్మక యజ్ఞాలను వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పండుగ ప్రత్యేక అధికారులు రామకృష్ణ, వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు తిరు క్కోవెల కపేందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్ ప్రసాద్, రఘు, ఉపప్రధానర్చకులు చిరంజీవ స్వామి, మారుతీ ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

- **అంజన్నను దర్శించుకున్న విప్, ఎమ్మెల్యేలు**

కొండగట్టులో జరుగుతున్న పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి, పెద్ద పల్లి ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణారావు అంజన్న దర్శిం చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైదరాబాద్‌కు చెందిన పద్మశాలి సంఘ ప్రతినిధులు తయారు చేసిన పట్టువస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. అనంతరం యాగశాలలో జరుగుతున్న త్రికుండాత్మక యాగంలో పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ దీక్షాపరులు



మాల విరమణ చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు



కొండపైన భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవకులు



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న హనుమాన్ దీక్షాపరులు



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు

- స్టడీసర్కిల్‌లో మరో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ



వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

కరీంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డీఎస్సీ-2024, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కరీంనగర్, జగిత్యాలలోని తెలంగాణ ఎస్సీ స్టడీసర్కిల్‌లో డీఎస్సీ-2024, ఇతర పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మరో నెల రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా వసతి సౌకర్యం కూడా కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పెద్దఎత్తున ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసేందుకు డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డీఎస్సీ-2024తోపాటు పోటీపరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం ఎస్సీ స్టడీసర్కిల్‌లో రెండు నెలల నుంచి ఇస్తున్న ఉచిత శిక్షణ మే 31తో ముగిసింది. జూలై 17 నుంచి 31వ తేదీ వరకు డీఎస్సీ-2024 నిర్వహిస్తున్నందున ఉచిత శిక్షణ గడువును పొడగించాలని విద్యార్థులు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరడంతో ఆయన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు మరో నెలరోజులపాటు ఉచితశిక్షణ, వసతి కల్పిస్తుందని లక్ష్మణ్‌కుమార్ తెలిపారు.

పాము కాటుకు చిన్నారి మృతి

పెద్దపల్లిటౌన్, జూన్ 1: పాము కాటుతో చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సాగర్ రోడ్డుకు చెందిన నిట్టూరు వైష్ణవి (11) దాహం వేసి ఫ్రిజ్ వద్దకు వెళ్లి నీళ్లు తాగింది. కాలుకు నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఎలుకలు కాటువేశాయని భావించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలించారు. పాముకాటుకు గురైందని వైద్యులు నిర్ధారించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గంమధ్యలో చిన్నారి మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

ధర్మారం, జూన్ 1: మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన రాంపెల్ల వినోద(54) అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 25న తల నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ధర్మారం, జూన్ 1: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి వడదెబ్బతో మృతిచెందాడు. అతడి వయస్సు 35 ఉంటుందని, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, నల్లని గీతల ఫుల్ హాండ్స్ షర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఎవరైన గుర్తు పట్టినట్లైతే ఈ క్రింది నంబర్లు ఎస్సై 8712656508, సీఐ 8712656505, ఏసీపీ 8712656507 సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

- **గర్షకుర్తిలో వృద్ధురాలు..**

గంగాధర: గంగాధర మండలం గర్షకుర్తికి చెందిన వృద్ధురాలు వడదెబ్బతో శనివారం మృతి చెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్షకుర్తికి చెందిన చిందం అన్నవ్వ(86) రేకుల షెడ్డులో ఉంటుంది. ఎండ వేడికి శుక్రవారం రాత్రి వాంతులు చేసుకుని శనివారం ఉదయం మృతి చెందింది.

నాటుసారా పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1: గోదావరిఖని ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని శనివారం ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. నాటుసార తరలిసున్నారనే సమాచారం మేరకు కాలనీలోని మార్కెట్ సమీపంలో కోర మాన్య అనే వ్యక్తిని తనిఖీ చేయగా, నాలుగు లీటర్ల నాటుసార లభ్యమైంది. కోరమాన్యపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

కోల్‌సిటీటౌన్, జూన్ 1: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శనివారం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మార్కండేయకాలనీలోని హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

జ్యోతినగర్, జూన్ 1 : హనుమాన్ జయంతిని శనివారం ఎన్టీపీసీ ఏరియాలో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రాంతంలోని అన్ని హనుమాన్ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఎన్టీపీసీ పీటీఎస్‌లోని భక్తాంజనేయ ఆలయంలో మన్యుసూక్త హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రుద్రభట్ట ధనుంజయ శర్మ, రుద్రభట్ట శ్రీకాంతశర్మ, సురేష్ శర్మ, సతీష్ శర్మలు హోమ క్రతువును నిర్వహించగా వేముల అనిల్‌కుమార్, బండారు కనకయ్య, మధు నాగేందర్, భక్తులు పాల్గొన్నారు. కాగా, హనుమాన్ జయంతి సందర్భంగా హిందు వాహని ఆధ్వర్యంలో మేడిపల్లి సెంటరులో హనుమాన్ భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోలివాడ శ్రీకాంత్, బాపు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీపీసీ పీటీఎస్‌లోని ఆలయంలో హోమం



గోదావరిఖనిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



పెద్దకల్వలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణరావు

మంథని, జూన్ 1: పెద్ద హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు శనివారం వైభవంగా జరుపుకున్నారు. భక్తులు హనుమాన్, వైష్ణవ ఆలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీక్షాపరులు భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎక్కాం భజనలు నిర్వహించారు. స్థానిక పెంజేరుకట్టలోని హనుమాన్, బలవీర హనుమాన్, రావుల చెరువుకట్ట, తమ్మి చెరువు, వాగుగడ్డ, నడివీధిలోని శ్రీబాలహనుమాన్, లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలోని, గోదావరినదితీరంలోని, ఎరుకలగూడెంలోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. దీంతో శ్రీహనుమాన్ ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి.

పెద్దపల్లి రూరల్, జూన్ 1 : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దకల్వల అంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే విజయరమణరావు హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. మాజీ సర్పంచ్ కొరెంగల రమేష్, మాజీ ఉపసర్పంచ్ అర్కుటి సంతోష్ యాదవ్ పాల్గొన్నారు. పెద్ద బొంకూర్, హన్మంతుని పేట, భోజన్నపేట, మూలసాల, కొత్తపల్లి, అప్పన్నపేట, రాఘవపూర్‌లతోపాటు పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు.

ఓదెల, జూన్ 1 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అలాగే పూజలు నిర్వహించిన అనంతరం గ్రామస్థులకు సహపంక్తి భోజనాలను నిర్వహించారు. కందుల సదాశివ్, గుర్రం సదానందంగౌడ్, వీర్ల రవిందర్, ఆది, సతీష్, కందునూరి సురేందర్, వేల్పుల సాయిచరణ్, కందుల మల్లేశం, నాగేష్, సాయి పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూన్ 1: హనుమాన్ దీక్షాపరులు, భక్తులు స్థానిక పెరికి గిద్ద ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రెడ్డి-విజయలక్ష్మి దంపతులతో నిర్వహించిన హోమంలో భక్తులు పాల్గొన్నారు. శాస్త్రినగర్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్, మాజీ సర్పంచ్ పద్మ ఆధ్వర్యంలో పూజల్లోనూ, సుద్దాల రామాలయంలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు పాల్గొని పూజలు చేశారు.

వర్షాకాలంలో వచ్చే విపత్తులను ఎదుర్కోవాలి : కలెక్టర్

పెద్దపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే విపత్తులను ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాబోయే వర్షాకాలం సీజనల్ సమస్యల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ జేఅరుణశ్రీతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో వచ్చే పత్తులను ఎదుర్కొనేందుకు మన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులో ఉన్న నాలాలను అధికారులు పూర్తిగా పరిశీలించాలని, నాలాలపై జరుగుతున్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. నాలాల్లో నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చూడాలని, నాలాలో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే చెత్త, పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. జిల్లాలో అక్రమ మైనింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ చట్టాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, నాణ్యత ప్రమాణాలు ప్రతి హోటల్లో పాటించే విధంగా పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, డీపీవో ఆశాలత, డీఆర్‌డీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

రామగిరి, జూన్ 1: మండలంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ హాళ్లను శనివారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌లు పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ గడువు సమీపంలో ఉండడంతో పనులు వేగవంతం చేయాలన్నారు. కళాశాలలో కౌంటింగ్ హాళ్లను, స్ట్రాంగ్ తాళానికి సంబంధించిన సీల్ తనిఖీ చేశారు. కేంద్రం వద్ద పటిష్ట భద్రతను ఏర్పాట్లను చేపట్టాలన్నారు. కేంద్రంలోకి పాస్‌లు ఉన్నావారికే అనుమతి కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాంచందర్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉన్నాయి : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూన్ 1: రాబోయే వానాకాలం పంట సీజన్‌కు జిల్లాలో సమృద్ధిగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల పంటలకు సంబంధించి విత్తనాల స్టాక్ డీలర్ల వద్ద ఉందని, రైతులు అనవసరపు ఆందోళనలు చెందవద్దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు శనివారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో వానాకాలం విత్తనాల లభ్యతను వివరిస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, వచ్చే వానాకాలం పంటకు ఎక్కడా విత్తనాల కొరత రాకుండా పటిష్ట చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న 353 విత్తన డీలర్ల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఉన్న లక్షా 55 వేల 720 వేల ఎకరాల సాగు భూమి ఉందని, వీటిలో 2 లక్షల 8 వేల ఎకరాలలో వరి పంట, 134వేల ఎకరాలలో పత్తి పంట, 12 వేల ఎకరాలలో కూరగాయలు పండ్లు ఇతర పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ప్రతి పంటకు సంబంధించి అవసరానికి మించి 50 శాతం అదనంగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా విత్తనాల కొరత లేదని, ఎక్కడైనా విత్తనాల రవాణా, తదితర అంశాలలో చిన్న, చిన్న ఇబ్బందులు వచ్చి ఒకటి, రెండు రోజులు రైతులకు చేరడంలో ఆలస్యం కావచ్చని, విత్తనల స్టాక్‌కు ఎక్కడ కొరత లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న పంటలు వారు వినియోగిస్తున్న విత్తనాలపై వ్యవసాయ అధికారుల ద్వారా సర్వే నిర్వహించి, సదరు విత్తనాలు సమీప విత్తన డీలర్ల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వానకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమయ్యే పచ్చిరొట్ట విత్తనాలు సైతం అందుబాటులో ఉన్నాయని, వరి సన్న రకాల విత్తనాల స్టాక్‌లు, పత్తి విత్తనాలలో 134 రకాల విత్తనాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. బీటీ3 వంటి పత్తి విత్తనాలను నిషేధించడం జరిగిందని, వీటిని ఎక్కడా డీలర్లు విక్రయించకుండా చర్యలు తీసుకున్నామని, రైతులు ఎక్కడ కూడా ఈ విత్తనాలను ఉపయోగించవద్దని, ఎవరైనా ఈ విత్తనాలు విక్రయిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదు..

- తెలంగాణ అధికారిక గీతం, చిహ్నంపై బీఆర్ఎస్ రాజకీయం - సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

గోదావరిఖని, జూన్ 1: బీఆర్ఎస్ దశాబ్దకాలంలో తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదని, ప్రజా స్వామ్యాన్ని కాలరాసిందని, కనిపించకుండా నియంతృత్వ పాలన కొనసాగించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. శనివారం గోదావరిఖని ఇల్లందు క్లబ్‌లో జరిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ పేరిట నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టుతో మేలుకంటే కీడే ఎక్కువ జరిగిందని విమర్శించారు. తెలంగాణ ధనిక రాష్ట్రమంటూ అప్పులు కుప్పలు చేసిందని, అందుకే ప్రజలు గత ఎన్నికల్లో ఓడించారని, ఇప్పటికైనా ఆ పార్టీ బుద్ధి తెచ్చుకుని నిర్మాణాత్మకంగా ప్రజలకు దగ్గరై పనిచేయాలని సూచించారు. గత బీఆర్ఎస్ పాలనలో అన్ని సంస్థలను ఆర్థికంగా కూల్చివేశారని, విద్యుత్, ఇరిగేషన్‌తో పాటు సింగరేణిని కూడా నాశనం చేశారని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం దగ్గర డబ్బులు లేకపోయినప్పటికీ సర్దుబాట్లు చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ కొంగుబంగారమైన సింగరేణిలో వేల కోట్లను గత సీఎండీ నడిమెట్ల శ్రీధర్ దోపిడీ చేశారని, అందులో పాలకులను కూడా భాగస్వామ్యం చేశారని, ఈ కుంభకోణంపై న్యాయమూర్తిచే విచారణ చేయించి దోచుకున్న సొమ్మును కక్కించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ అధికారిక గీతం, చిహ్నంపై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తూ ధర్నాలు చేస్తుందని, ఇది సరికాదని, వారి అభిప్రాయాలు, సూచనలు చేయాలన్నారు. అధికార చిహ్నంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, అందరితో చర్చించాకనే నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు బూర్జువ పార్టీలేనని, కాంగ్రెస్‌తో తాము కలిసి పని చేసినంతమాత్రాన పోరాటాలు ఆపమని, రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటామని చెప్పారు. మోదీ ఎన్నికల్లో ముస్లిం వ్యతిరేకత, విద్వేషాలు రెచ్చగొట్టి హిందువుల పేరుపై గెలువాలని ప్రచారం చేశారన్నారు. కాంగ్రెస్ గెలిచిన చోట సీపీఐ బలమున్నదని, భవిష్యత్‌లో 25 నుంచి 30 స్థానాల్లో గెలుపొందేందుకు పార్టీ బలోపేతంపై దృష్టి పెడతామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు ఎల్ ప్రకాష్, వైవీరావు, మడ్డి ఎల్లయ్య, కనకరాజు, కే స్వామి, ఆరెల్లి పోషం, కన్నం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

నకిలీ పత్తి విత్తనాల దందాపై ఉక్కుపాదం

- మంచిర్యాల జిల్లా బొప్పారంలో 5క్వింటాళ్ల నకిలీ విత్తనాలు స్వాధీనం - ముగ్గురి అరెస్టు - రామగుండం సీపీ శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జూన్ 1: నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రామగుండం కమిషనరేట్ పోలీసులు ఈ దందాపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండడాన్ని ఆసరాగా తీసుకుని నకిలీ విత్తనాల వ్యాపారులు ఈ దందాకు పాల్పడుతున్నారు. శనివారం మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం బొప్పారం గ్రామంలో కర్నకొండ చంద్రశేఖర్ అనే వ్యక్తి ఇంటిపై టాస్క్‌ఫోర్స్‌తో దాడి చేయించగా 5క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు దొరికినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. ఈ మేరకు శనివారం కమిషనరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలనుసారం వ్యవసాయశాఖ సమన్వయంతో కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని, నాలుగు రోజుల క్రితం చెన్నూరులో 5క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. తమ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్ఐ లచ్చన్నలు శనివారం నెన్నెల మండలం బొప్పారంలో కర్నకొండ చంద్రశేఖర్ ఇంటిపై దాడి చేయగా ఐదు క్వింటాళ్ల ప్రభుత్వ నిషేధిత బీటీ-3 నకిలీ పత్తి విత్తనాలను గుర్తించడం జరిగిందన్నారు. భైంసాకు చెందిన రజాక్, మందమర్రికి చెందిన జాని అనే వ్యక్తుల వద్ద తక్కువ ధరకు ఈ విత్తనాలు కొనుగోలు చేశామని, వీటిని సొల్లు పెద్దయ్య తమకు రవాణా చేసినట్టు నిందితులు పేర్కొన్నారన్నారు. ఈ వ్యాపారంలో బెల్లంపల్లి మండలం చాకెపల్లికి చెందిన సూరం దిలీప్, కాసిపేటకు చెందిన కల్లూరి వెంకటేశం కూడా భాగస్వాములుగా ఉన్నట్టు నిందితులు పేర్కొన్నారన్నారు. ఇతని వద్ద ఒక సెల్‌ఫోన్ కూడా సీజ్ చేశామన్నారు. నాలుగు రోజుల క్రితం 5.5క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నామని, గుంటూరుకు చెందిన సుబ్బారావు రవాణా చేసినట్టు నిందితులు పేర్కొన్నారన్నారు. అతని కోసం గాలిస్తున్నట్టు సీపీ తెలిపారు. కర్ణాటకలో ప్రాసెసింగ్ చేసిన ఈ నకిలీ విత్తనాలను అమాయక రైతులకు అంటగట్టేందుకు తీసుకువస్తున్నారన్నారు. ఈ విత్తనాలు చాలా వరకు పురుగుపట్టి ఉన్నాయని, ఇవి మొలకెత్తక, మొలకెత్తినా పంటదిగుబడి రాక రైతులు నష్టపోయి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందన్నారు. నకిలీ విత్తన వ్యాపారులను ఉపేక్షించేది లేదని, అవసరమైతే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. నకిలీ విత్తనాల రవాణాను అరికట్టేందుకు వ్యవసాయ, సీడ్ సర్టిఫికేషన్ అధికారులతో టాస్క్‌ఫోర్స్ చేశారని, వీరి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నకిలీ విత్తనాల రవాణాను నిరోధించేందుకు అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులను కూడా ఏర్పాటు చేసినట్టు సీపీ తెలిపారు. రామన్నపల్లె వద్ద అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుతో పాటు జన్నారం, బసంత్ నగర్ తదితర ప్రాంతాల్లో అంతర్ జిల్లాల చెక్‌పోస్టులను కూడా ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో విత్తనాల కొరత ఉందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలను పట్టుకోవడంలో కృషి చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ పాల్గొన్నారు.

ముగిసిన ఈజీఎస్ పనుల సామాజిక తనిఖీ

మంథని, జూన్ 1: మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై పది రోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీ శనివారంతో ముగిసింది. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇన్‌హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ సత్యనారాయణ మాట్లాడుతూ మంథని మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసిందన్నారు. సంవత్సరం కాలం పాటు మంథని మండలంలోని 34 గ్రామ పంచాయితీల్లో రూ.5.68 కోట్లతో 667 ఉపాధిహామీ పనులు, రూ.8 కోట్ల నిధులను 38 పనులను పంచాయతీరాజ్ ద్వారా రూ.7 లక్షలతో 2 పనులను ఫారెస్టు శాఖ ద్వారా నిర్వహించామన్నారు. వీటన్నింటిపైన సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటిస్తూ ఉపాధి హామీ కూలీలను కలిసి వివరాలు సేకరించడంతో పాటు మెటీరియల్ పనులను సైతం కొలతలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో డ్వామా అధికారులు అమృత్‌కుమార్, శరత్‌కుమార్, కొమురయ్య, గణేష్, ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, ఎస్ఆర్‌పీ ప్రదీప్‌కుమార్, ఏఈ అనుదీప్‌లతో పాటు సామాజిక తనిఖీ బృందం డీఆర్‌పీలు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

నేత్రదానం

జ్యోతినగర్, జూన్ 1: వడదెబ్బతో శుక్రవారం మరణించిన ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌కు చెందిన ఈదునూరి శ్రీకాంత్ నేత్రాలను అతడి కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ, శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించడంతో వారు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర దానం చేశారు. ఈ మేరకు సదాశయ ఫౌండేషన్ సభ్యులు నేత్రాలను సేకరించి ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి అందజేశారు. శ్రీకాంత్ నేత్ర దానంతో మరో ఇద్దరికి చూపు వచ్చింది. పుట్టెడు దుఃఖంలో తమ కొడుకు నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించిన తల్లిదండ్రులు ఉమ్మయ్య, శంకమ్మ, ఇతర కుటుంబ సభ్యులను సదాశయ ఫౌడేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అభినందించారు.

పౌష్టికాహారం పంపిణీ

పెద్దపల్లి రూరల్, జూన్ 1: పెద్దపల్లి మండలం రాఘవపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అర్హులకు పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలమృతం, కోడిగ్రుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి

ఓదెల, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన వీరులకు శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని కొలనూర్‌లో కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థుల, అమరుల త్యాగాల ఫలితంగా రాష్ట్రం సిద్ధించిందన్నారు. అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు జనగాం రవి, జంగం కొమురయ్య, మోహన్‌రెడ్డి, బండారి చంద్రయ్య, అమల శంకర్, కిరణ్, కొమురయ్య, అసరి వెంకటేషం, బండారి సదయ్య, తుంగని అశోక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి'

కమాన్‌పూర్, జూన్1 : కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష నేతలపై అర్థరహిత విమర్శలు చేయడం మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు హితవు పలికారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారిలో రామగిరి మండలంలో నిర్మాణాల కూల్చివేతకు సంబంధించి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయడం సరికాదన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు జడ్పీ చైర్మన్‌పై అవాకులు చేవాకులు మాట్లాడుతున్నారని, మరోమారు అర్థరహిత విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షులు అనిల్‌గౌడ్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ కొట్టె భూమయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ సర్పంచులు తాటికొండ శంకర్, కొండ వెంకటేష్, సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్, ఆకుల రమేష్, సుధాకర్, తోట రాజ్‌కుమార్, రామ్మూర్తి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చందనాపూర్ గ్రామంలో రెండు బెల్ట్‌షాపులపై సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. కిరాణా షాపులలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న గట్టు శ్యాంసుందర్, జలీల్ కిరాణంలో అక్రమంగా నిల్వఉంచిన 1,12,600 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాప్ నిర్వాహకులను టూటౌన్ పీఎస్‌లో అప్పగించారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

మంథని, జూన్ 1: పట్టణంలోని పలు ప్రైవేటు విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఒకే బ్రాండ్‌కు సంబంధించి విత్తనాలను బ్లాక్ చేస్తే కఠిన చర్యలుంటాయాని డీలర్లను హెచ్చరించారు. డీలర్లు ఎట్టి పరిస్థితుల్లో ఎంఆర్‌పీ ధర మించి అమ్మరాదని వ్యవసాయాధికారి హెచ్చరించారు. ఇంకా పత్తి విత్తన అమ్మకాలు మొదలు కాలేదని, రైతులు ఒకే బ్రాండ్ వెంట పడరాదని సూచించారు. అన్ని బీజీ-2 హైబ్రీడ్స్ ఒకే దిగుబడి ఇస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా పలు స్టాక్ రిజిస్టర్‌లు, ఇన్వాయిస్‌లు పరిశీలించారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

కోల్‌సిటీ, జూన్ 1: పదవీ విరమణ పొందిన పారిశుధ్య కార్మికులను శనివారం రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సన్మానించారు. రామగుండం నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలో సుదీర్ఘ కాలం పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా పని చేసి పదవీ విరమణ పొందిన పర్శ బతుకమ్మ, రాసకట్ల వెంకటమ్మలకు శనివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ పొందిన పర్శ బతుకమ్మను సన్మానించారు. మరో ఉద్యోగి రాసకట్ల వెంకటమ్మ అనారోగ్య కారణాలతో రాలేకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్, వర్కర్స్ యూనియన్ నాయకులు యాకయ్య, మురళీధర్‌రావు, మంథని లింగయ్య, వేల్పుల రాయమల్లు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మంథని, జూన్ 1: స్థానిక ఎరుకలగూడెంలో పర్శవేన కళ్యాణి (28)అనే వివాహిత తాను కిరాయికి ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారెపల్లికి చెందిన మామిడి సమ్మక్క రెండో కూతురైన పర్శవేన కళ్యాణిని మంథని మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పర్శవేన శంకర్‌కు ఇచ్చి 2013లో వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా మంథనిలోని ఎరుకులగూడెంలో అద్దె ఇంటిలో ఐదు సంవత్సరాలుగా నివసిస్తున్నారు. కళ్యాణికి కోటపర్తి రవిశ్యామ్ అనే యువకుడు ఫోన్ ద్వారా పరిచయమయ్యాడు. తనకు డబ్బులు ఇవ్వాలని, జీవితాంతం తనతో ఉండాలని లేకుంటే తనతో దగ్గరగా ఉన్న వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో పెడుతానని గతంలో కళ్యాణిని బెదిరింపులకు గురిచేయగా పెద్దల సమక్షంలో ఒకరి జోలికి ఒకరు రావద్దని ఒప్పంద పత్రం రాయించుకున్నారు. వారం రోజులుగా కళ్యాణిని తనతో బయటికి రావాలని లేదంటే ఫొటోలు, వీడియోలు బయట పెడుతానని మళ్లీ కోటపర్తి రవిశ్యామ్ బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయం తెలిసిన అత్త రాజమ్మ, భర్త శంకర్‌లు పట్టించుకోకుండా కళ్యాణిని వేధిస్తుండటంతో మనస్థాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి మామిడి సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆర్జీ-2 మే నెల ఉత్పత్తి 136 శాతం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1: ఆర్జీ-2 ఏరియా గడిచిన మే నెలలో 136 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు జీఎం సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఉత్పత్తి వివరాలను ప్రకటించారు. ఏరియాకు 6.29 లక్షల టన్నుల టార్గెట్‌కు 8.52 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి(136%) సాధించినట్టు జీఎం తెలిపారు. 50.34 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీయాల్సి ఉండగా, 31.78 లక్షల క్యూబిక్ మీటర్లు(63%) తీసినట్టు జీఎం తెలిపారు. ఆర్జీ-2 ఏరియా నుండి 8.66 లక్షల టన్నుల బొగ్గు రవాణా గడిచిన నెలలో జరిగినట్టు జీఎం పేర్కొన్నారు. నేడు జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కార్మికులు, కార్మిక కుటుంబాలు పాల్గొని విజయవంతం చేయాలని జీఎం సూర్యనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్జీ-3లో 94 శాతం, ఏపీఏలో 96 శాతం ఉత్పత్తి

రామగిరి, జూన్ 1: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో 94 శాతం ఉత్పత్తి, ఏపీఏ డివిజన్‌లో 96శాతం ఉత్పత్తిని సాధించాయని ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు శనివారం ఒకప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు శనివారం మే మాసం తపు ఉత్పత్తి వివరాలతో కూడిన ప్రకటన విడుదల చేశారు. ఆర్జీ-3 ఏరియాకు నిర్ధేశించిన 5.48 లక్షల టన్నులకు గాను 5.16 లక్షలు సాధించి 94 శాతంలో నిలువగా ఏపిఏ డివిజన్‌కు నిర్ధేశించిన 0.92 లక్షల టన్నులకు గాను 0.88 లక్షల టన్నులు సాధించి 96 శాతంలో నిలిచిందన్నారు. సింగరేణి ఉద్యోగులు బాధ్యత కూడిన ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకొవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

జీడీకే 11ఇంక్లైన్‌లో కార్మికునికి గాయాలు

గోదావరిఖని, జూన్ 1: సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌లో శనివారం రెండవ షిఫ్టులో జరిగిన ప్రమాదంలో రియాజ్ అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. కంటిన్యూయస్ మైనర్ వద్ద రియాజ్ పని చేస్తుండగా కాలుకు ఇనుప రాడ్డు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. రియాజ్‌ను సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.

ఆవిర్భావ వేడుకలకు ముస్తాబైన ప్రాంగణం

రామగిరి, జూన్ 1: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రాణి రుద్రమాదేవి క్రీడాప్రాంగణం ముస్తాబైంది. ఆదివారం నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సర్వాంగా సుందరంగా క్రీడాప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. స్టాల్స్, రంగు, రంగుల సిరిస్ దీపాలతో విరాజిల్లుతోంది. ఆవిర్భావ వేడుకలకు వచ్చే కార్మికుల కుటుంబాలతో పాటు ప్రభావిత గ్రామాల ప్రజలకు అసౌకర్యాల కలగకుండా ఏర్పాట్లను చేపట్టారు. క్రీడాప్రాంగణంలోని స్టేజ్‌ను సుందరంగా అలకరించారు. వచ్చే విజిటర్స్‌కు షామియానాలను, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఆహుతులను ఆహ్లాదపరిచేందుకు ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు వెళ్లి పరిశీలించారు.



ముస్తాబైన రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణం

ఉత్తమ కార్మికులు వీరే..

తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో ఉత్తమ కార్మికులను ఎంపిక చేస్తు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో కొత్తగూడేంలో సెంట్రల్‌పంక్షన్‌కు ఓసీపీ-1 చెందిన డిప్యూటి మేనేజర్ రాములు, ఏఎల్‌పి నుంచి ఎగ్జిక్యూటివ్ రఘువంశీలు ఎంపికయ్యారు. వీరిని కొత్తగూడేంలో జరిగే సన్మానం కార్యక్రమంలో సత్కారం అందుకొనున్నారు. ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-2 ఎక్స్‌ప్లోజీవ్ క్యారియర్ అమరేందర్‌రెడ్డి, ఏఎల్‌పి గని మల్టీ జాబ్‌వర్కర్ విజయ్‌లు ఎంపికయ్యారు. వీరిని ఆర్జీ-3 ఏరియాలోని రాణి రుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో అధికారులచే సత్కారం అందుకొనున్నాట్లు తెలిపారు.

ఆర్జీ-2 ఉత్తమ ఉద్యోగుల ఎంపిక..

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా అన్ని ఏరియాల్లో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి సన్మానించనున్నది. దీనిలో భాగంగా ఆర్జీ-2 ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా బీ చంద్రశేఖర్, రంగిశెట్టి వెంకన్నలను యాజమాన్యం ఎంపిక చేసింది. వకీల్‌పల్లె గనిలో సూపరెండెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ కొత్తగూడెంలో జరిగే ప్రధాన ఉత్సవంలో సీఎండీ చేతుల మీదుగా సన్మానం పొందనున్నారు. ఓసీపీ-3లో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రంగిశెట్టి వెంకన్న ఆర్జీ-2 ఏరియా ఉత్సవంలో సన్మానం పొందనున్నారు.



చంద్రశేఖర్, వెంకన్న